
కథ

# పూలవంతెన

**పారుపూడి వెంకట సత్యనారాయణ**

**ఇండియాలో ప్లేన్ దిగగానే భర్త తనని చూసి షాక్ తినడు కదా!**
**బాబు... శ్రీప్రియ ఏడుస్తారేమో అందమైన అమ్మ చెంప ఇలా కాలిపోయినందుకు.**
**అసలు అలా ఊడిన చర్మంతో దాదాపు నెల్లాళ్ళ ఆస్పత్రిలో వుంది. అసలు బ్రతుకుతుందనుకోలేదు తను.**
**ఆరోజు దుబాయ్‌లో ఆస్పత్రి నుంచి ఇంటికొచ్చాక తన మొహం చూసి తనకే భయం వేసింది. ఒకవైపు అంతా జుట్టు లేదు. మెడ, చెంప, ఆ వైపు చెయ్యి, కాలు కూడా చర్మం కాలిపోయి వికారంగా వున్నా బట్టలు కప్పేస్తున్నాయి కనుక ఫరవాలేదు.**
**''మేడమ్ ప్లేన్ ల్యాండవుతోంది... బెల్టు కట్టుకోండి''.**
**ఎయిర్‌హోస్టెస్ చిరునవ్వు నవ్వుతూ మృదువుగా తట్టి లేపింది.**
**బిందు ఉలిక్కిపడింది.**
**'అరె ప్లేన్ ఎక్కిన దగ్గర్నుంచీ ఆలోచనలో పడిపోయిందన్నమాట. అందుకే అన్ని గంటల ప్రయాణం తెలియనే లేదు'.**
**ఎయిర్‌పోర్ట్‌లో బిందుకళ్లు తన వాళ్లకోసం ఆత్రుతతో వెతికాయి.**



★★★

అద్దం ముందు నిలబడి ఇయర్ హేంగింగ్స్ కలర్... కట్టుకున్న డ్రెస్‌కి మ్యాచ్ అయిందో లేదో చూసుకుంటోంది శ్రీప్రియ. అప్పటికి నాలుగు డ్రస్‌లు విప్పి కుర్చీలో పడేసింది. ముంగురులు నుదుటిమీద పడి రింగులు రింగులు తిరిగేలా ట్రై చేస్తుంటుంది కాసేపు. వేసుకున్న మోడ్రన్ డ్రస్‌కీ, ఆ హెయిర్ స్టయిల్‌కీ చక్కగా నప్పింది.


''ప్రియా పార్టీ ఏమయినా వుందా?'' బిందు మంచం మీద పడుకుని తదేకంగా కూతురికేసి చూస్తూ అంది.

''అవును అనిల్ బర్త్‌డే... మమ్మీ!'' పది రోజులుగా అడిగినదానికి ముక్తసరిగా జవాబిస్తుంది తప్ప వివరంగా మాట్లాడదు ప్రియ.

''అనిల్ ఎవరు?''

''అబ్బ నీకన్నీ ప్రశ్నలే మమ్మీ. అనిల్ నా బోయ్ ఫ్రెండ్'' సున్నాలా మూతి చుట్టింది ప్రియ.

ప్రియ మొహం మీదే నిలిచిపోయాయి హిమబిందు చూపులు. ఎంత అందంగా వుంది? ఇది అసలు తన కూతురేనా? చక్రాల్లాంటి కళ్ళు, పచ్చని మొహం, ఎర్రని చిన్ని నోరు, ముత్యాల్లాంటి పలువరస. చక్కని శరీర సౌష్టవంతో ఆరోగ్యంతో వయసు తెస్తున్న అందాలతో మెరిసిపోతోంది. అబ్బ తన దిష్టే తగులుతుందేమో! బలవంతాన చూపులు మరల్చుకుంది.



తను వచ్చిన పదిహేను రోజుల్నుంచీ చూస్తోంది. రోజూ ఏదో ఒక పార్టీ పేరుతో ప్రియ రోజు మొత్తం బయటే వుంటుంది. అసలు కాలేజీకి ఎప్పుడు వెళ్తోంది? ఏం చదువుతోంది? ఎంతసేపు అలంకరణవైపే దృష్టి. లేత వయసులో ఆడపిల్లలకు దేహం మీద ఆకర్షణ సహజం. కాని చురుకైన పిల్లలకి అది మరీ ఎక్కువైతే కాస్త ప్రమాదమే. అందుకే కూతురికి కోపం వస్తే వచ్చింది అని అడిగింది బిందు...

''ప్రియా! అన్నయ్య గాని డాడీగాని నీతో వస్తున్నారా?''

''వాళ్ళెందుకు... అనిల్ నా ఫ్రెండ్''.

''పోనీ నేను రానా?''

''నువ్వా పార్టీకా?'' బిగుసుకుపోయింది శ్రీప్రియ. అదీ ఒక్క క్షణమే - వెంటనే తేరుకుని ఆనేసింది ఖండితంగా.

''వద్దు మమ్మీ! బాగుండదు. నీ ఫేస్... కాదు.. నీ ఆరోగ్యం...'' ఏదో తడబాటు ప్రియ గొంతులో...

''నేను బాగానే ఉన్నానమ్మా!'' కూతురు తన ఆరోగ్యం గురించి తను వచ్చిన ఇన్నాళ్ళకి పట్టించుకుంటుంటే మనసు తేలిక పడింది బిందుకి.

వచ్చిందగ్గర నుంచీ పిల్లలిద్దరూ మునుపటిలా 'మమ్మీ' అంటూ కౌగలించుకోకుండా దూరదూరంగా తిరుగుతుంటే ఎంతో బాధపడింది. భర్త ఎంత ప్రయత్నించినా బాబు మాత్రం అసలు దగ్గరికి రావడం లేదు.

''ఏం అనుకోకు బిందూ! వాళ్ళు పెద్దవాళ్ళవుతున్నారు కదా! అదీకాక ఇన్నాళ్లూ నువ్వు దూరంగా వున్నావు కదా! నాలుగురోజులు పోతే వాళ్ళే చేరతారు నీ చుట్టూ'' తన బిడ్డల గురించి భర్త సంజాయిషీ చెప్తుంటే బిందుకి సిగ్గనిపించింది.

''చాల్లెండి - అక్కడికి నేనేదో బాధపడిపోతున్నట్లు-'' అంది ప్రశాంతంగా. కానీ మనసులో ముల్లు గుచ్చుకున్నట్టు వుంది.

బాబుది కోపమో నిర్లిప్తతతో తెలియదు. వచ్చాక మొక్కుబడిగా 'హలో' అన్నాడు పరాయివాడిలా.

వచ్చేముందు తన అవతారం చూసి ఎంత బాధపడిపోతారో ఎలా ఓదార్చాలో అని ఎన్నిసార్లు రిహార్సల్ వేసుకుందో? కానీ వాళ్ళు తన గురించి బాధపడడం అటుంచి పట్టించుకోవడమే లేదు. పెద్దవాళ్ళవుతున్నారు అని సరిపెట్టుకుందామంటే మనసు ఒప్పుకోవడం లేదు. ఎందుకంటే - రాజారాం బయటినుంచి రాగానే మెడచుట్టూ చిన్న పిల్లలా చేతులు వేస్తుంది ప్రియ. బాబు కూడా భోజనాల దగ్గర తండ్రితో ఎంతో ఆప్యాయంగా మాట్లాడతాడు. ''మమ్మీ నేను వెళ్తున్నాను. డాడీకి ఏదో బిజినెస్ పార్టీ వుందని చెప్పమన్నారు ఇందాక ఫోన్ చేసి మర్చిపోయాను. అన్నయ్య కోసం చూడకు. వాడికో టైమూ పాడూ లేదు. సింధు ఆంటీ వంటచేసి డైనింగ్ టేబుల్‌పై పెట్టి వెళ్ళిపోయింది. నీకాకలేస్తే తినెయ్''.

అప్పగింతలు పెట్టి హైహీల్స్ టకటక లాడిస్తూ వెళ్ళిపోయిన కూతుర్ని చూసి దీర్ఘంగా నిట్టూర్చింది బిందు.

భర్తకి రోజూ పార్టీలే. ఇంట్లో భోంచేయడమే గగనం. బాబు కాలేజీ నుంచి రావడం తడవు నాలుగు మెతుకులు కతికి క్రికెట్ బ్యాట్ పట్టుకుని వెళ్ళిపోతాడు. తన ఇంట్లోనే ఇలా వుందా? అందరిళ్లూ ఇంతేనా? ఊహూ కాదు ఎక్కడో ఏదో లోపించింది. ఏదో గ్యాప్ పెద్ద బండలా అడ్డుపడుతోంది.

తను రాగానే ''ఇంత ప్రమాదం జరిగితే నాకెందుకు రాయలేదు? నేను నీకేమీ కానను కున్నావా?'' అన్నాడు రాజారాం జాలిగా.

ఇంట్లో ఉన్నంతసేపూ అతని మాటలు

తనని గాలిలో నడిపిస్తాయి. బయటికెళ్తే ఇల్లు గుర్తుండదు. "ఏం చెయ్యను బిందూ! కొత్త బిజినెస్ కదా! బిందూ అసలు ఇక్కడ నువ్వుండే నాలుగు రోజులూ ఎక్కడికీ కదలకూడదనే అనుకున్నాను." అంటూంటే బిందూ నవ్వింది.

"నేను వచ్చిన దగ్గర్నుంచీ చూస్తున్నాను. ఏదో నాలుగు రోజులుండిపోయే చుట్టంలా ఈ మర్యాద లేమిటి? ఇది మన ఇల్లు అని మర్చిపోతున్నారు. జీవితమంతా ఇక్కడ కాకపోతే ఎక్కడికి పోతాను?"

"అదేమిటి సెలవులు ఈసారి ఎక్కువ రోజులిచ్చారా ఏంటి?"

"సెలవేమిటి?"

ఈసారి రాజారాం విస్తుపోయాడు.

"నా ఉత్తరం అందలేదా బిందూ?" అతని గొంతు ఎందుకో వణికింది.

"అందింది." అతడు తనను మరో రెండేళ్లు దుబాయ్‌లోనే ఉద్యోగం చెయ్యమని రాయడం గుర్తొచ్చి బిందుకి కోపం వచ్చింది చిన్నగా... "ఏంటి నేనీ పరిస్థితిలో అక్కడ ఇంకా పని చేయగలననుకున్నారా?"

"అది కాదు బిందూ! నువ్వు మరో నాలుగు నెలలు రెస్టు తీసుకునే వెళ్ళు. పోతే ఓ నాలుగు నెలల జీతమే పోతుంది".

"జీతం జీతం... ఎంతసేపు డబ్బుమాటేనా? ఇలా మారిపోయారేంటి? అసలు మీరు మీరేనా? డబ్బంటే ఎంత చీదరించుకునేవారు?"

"భలేదానివే బిందూ! జీవితంలో డబ్బు విలువ తెలిపింది నువ్వే. లేకపోతే బావిలో కప్పల్లా అక్కడే కొట్టుకుంటూ అదే ప్రపంచం అనుకునే వాళ్లం. కానీ డబ్బు ఎన్ని సుఖాలిస్తుందో, సొసైటీలో ఎంతటి స్థానం ఇస్తుందో, డబ్బు ఎలా పిల్లల్ని పెడుతుందో చూస్తున్న కొద్దీ నాకు ఎంతో ప్రేమ కలుగుతోంది డబ్బంటే".

తనని వెటకారం చెయ్యడానికి అలా అంటున్నాడేమో అనుకుంది మొదట్లో. కాని అది అతని హృదయ కుహరంలోంచి వచ్చినవే అని అతని ప్రవర్తన చెబుతోంది. నాలుగు రోజుల్నుంచీ అతని ప్రవర్తనలో తేడా కొట్టొచ్చినట్టు తెలుస్తోంది. తర్వాత బిందు మరింక దుబాయ్ వెళ్లనని ఖచ్చితంగా చెప్పాక రాజారాంకి చాలాకోపం వచ్చింది. గొంతు పెంచి అన్నాడు. "ఇప్పుడిలా నన్ను నట్టేట్లో ముంచేస్తే ఎలా బిందూ! నేనొక పెద్ద ప్రాజెక్టు వర్క్‌లో పూర్తిగా మునిగిపోయాను".

"అయితే ఏమంటారు? అసలు మీరేనా ఇలా మాట్లాడేది. మొదట్లో నన్ను వెళ్లనే వద్దు... ఉన్న దాంట్లోనే సంతృప్తి అన్న నోరేనా ఇది?"

"అవును అప్పుడలాగే అన్నాను. నువ్వు అలాగే వుండిపోతే బాగుండేది".


"అంటే నేనేమన్నా అక్కడ సుఖపడి పోయానంటారా?" రాజారాం నవ్వు నిర్లిప్తంగా వుంది.

"అవును నువ్వేంతో త్యాగం చేసావు. డబ్బు గనుల కోసం భర్తనీ పిల్లల్నీ వదిలి విదేశం వెళ్లావు. అక్కడ్నుంచి నువ్వు పంపిన ప్రతి పైసాకి న్యాయం చేస్తూ లెక్కలు చేస్తూ కుస్తీలు పట్టిందెవరు?" బిందు మాట్లాడలేకపోయింది. ఆమె మనసులో ఆలోచనా తరంగాలు...

డబ్బు ఎంత పాపిష్టిది. తల్లీ బిడ్డా, అన్నా చెల్లీ, అక్కా తమ్ముడూ, భార్యాభర్తల మధ్య ఎన్ని విభేదాలు సృష్టిస్తుంది? ఎంత అగాధాన్ని ఏర్పరుస్తుంది?

తన తప్పల్లా ఒక్కటే – ఆక్సిడెంటు విషయం దాచడం. అదీకాక ఇప్పుడు తన మనఃస్థితి దుబాయ్ వెళ్ళేందుకు అంగీకరించడం లేదు. శారీరకంగా బాగుండి వుంటే అతని అభ్యర్థన మన్నించి తను తప్పక మరో రెండేళ్ళు కష్టపడేదే. కానీ తనకి ఎంతో బెంగ వచ్చేసింది. భయం పట్టుకుంది. అందుకే ఉండలేక పోయింది. అయినా ఉన్న లక్షలు చాలవా? – ఈ సంభాషణ అయిందగ్గర్నుంచీ భర్త ఇంటి దగ్గరుండడం మరీ తగ్గించేశాడు. బాబు ఎటూ వుండడు. ప్రియ కూడా ఏదో పార్టీ పేరుతో వెళ్ళిపోతోంది. ఇక ఇంట్లో మిగిలింది తను ఒక్కతే.

వీళ్ళంతా ఎన్నోవేల మైళ్ళ దూరంలో వున్న ఒంటరితనం ఒకప్పుడు .... దగ్గరుండీ మనసులు దూరమైన ఒంటరితనం ఇప్పుడు.




గడియారం పదకొండు కొట్టింది. ఆలోచనల్లో పడిటైము గమనించని బిందు ఉలిక్కి పడింది. ప్రియ ఇంకారాలేదు. ఇంతసేపు పార్టీయా? ఆడపిల్లని అలా పార్టీలకి అలవాటు చేసిన భర్త మీద కోపం వచ్చింది. లాభం లేదు.

తను ఈ ఇంటి గృహిణి. ఇందులో వాళ్ళ బాగోగుల్తో తనకి నిమిత్తం వుంది. తను పట్టించుకుని తీరాలి... అనుకుంది బిందు స్థిరంగా.

***

హిమబిందు లేచి డ్రస్ చేసుకుంది. ఇంతలో బాబు వచ్చాడు. "బాబీ! చెల్లి పార్టీకి వెళ్ళి రాలేదురా?"

బాబు ఒక్కసారి నిరసనగా చూశాడు తల్లివైపు. అందులో ఎంత కోపం వుందో!

బిందు ఉలిక్కిపడి "నాకు అనిల్ ఇంటి అడ్రసు చెప్తావా?"

"చెప్పను" చాలా పదునుగా వుందామాట.

"పోనీ సాయం రా నాతో".

"రాను"

"ఎందుకు?"

"వెళ్ళి చూడు. ఏ పార్కులోనో, ఏ చెట్ల చాటునో ఎల్ఎస్‌డియో గంజాయో పీలుస్తూ ఒకరిఒళ్లో ఒకరు పడుకుని ఊహాలోకాల్లో తేలిపోతుంటారు". ఆ మాటలకి బిందు గుండె బద్దలయ్యింది. దుఃఖం ఉప్పెనలా పొంగుకొచ్చింది. అభావంగా ఒక్క క్షణం అలాగే చూసి లోపలికెళ్ళిపోయాడు కొడుకు. లైటు వెయ్యాలనే ధ్యాస కూడా లేకుండా అలాగే నిలబడిపోయింది బిందు...

కారాగింది. భర్త కూతురిని నడిపించుకుంటూ లోపలికి తీసుకొస్తున్నాడు. బిందు ఆత్రంగా పరిగెత్తింది. చీకట్లోంచి వచ్చిన భార్యను చూసి రాజారాం ఉలిక్కిపడినా తమాయించుకుని, "ఏదో కాస్త తల తిరిగిందట. అంతే" అన్నాడు. కూతురిని పొదివి పట్టుకుని నడిపించుకుంటూ బెడ్‌మీద పడుకోబెట్టాడు. "ఇటీజ్ బ్యాడ్ డాడీ! నన్నెందుకు తీసుకొచ్చేసావు? ఐ లైక్ అనిల్. ఐయామ్ మ్యాడ్ ఆఫ్ హిమ్" ఏదో పలవరిస్తోంది శ్రీప్రియ.

"ఇందుకేనా రాజా నన్నింకా ఫారిన్ వెళ్లమంటున్నావు?" బిందు హృదయం నిర్వేదంతో నిండిపోయింది.

తన మేనమామ మాటలు గుర్తొచ్చాయి. ఎంత ముందు చూపుతో ఎంత అభిమానంతో ఎంత మర్యాదగా తనని హెచ్చరించాడు అతి సున్నితంగా.

కానీ తనకు కళ్లు మూసుకుపోయాయి. ఎంతసేపు... డబ్బు... డబ్బు... డబ్బు... ఆ మాయలో పడినవాళ్లకి ఏమీ కనిపించదు. కాసుల గలగలలు... అంకెల గారడీలు.. బిందుకీ తనమీద తనకే చాలా కోపం వచ్చింది.

అసలు ఇండియా వచ్చేముందు ఎన్నిఆశలు పెట్టుకుంది? ఇల్లు ఇరుకు కాదు అనుకుంది కాని మనసులే ఇరుకు అయిపోతాయి అనుకుందా?

ఇండియా వెళ్లాక తనకింక ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం వుండదు అనుకుంది. ఈ ఇంటికి ఇంతచేసిన తనని భర్త, పిల్లలు నెత్తిన పెట్టుకుంటారు అనుకుంది. కానీ ఇదేమిటి ఇలా...

అసలు అమ్మ అనే ఒక ప్రాణి తమకోసం ఉందని పిల్లలు – భార్య తనకోసం ఎదురు చూస్తుందని భర్త అనుకోవడం లేదేమిటి?

తనకి కావలసింది పని లేకపోవడమూ, వంట మనిషి వండి పడేసిన వంట తిని పడుకోవడమేనా? తనకి హృదయం లేదా? స్పందన లేదా? అందులో కుటుంబం పట్ల ప్రేమ లేదా? వాటిని ప్రకటించే అవకాశం వీళ్లెందుకివ్వడం లేదు? తనని వేరు చేసి ఎందుకు చూస్తున్నారు? తను ఎవరికీ అక్కర్లేదా? ఆ ఆలోచన బిందును ఒక్క నిమిషం కంపింపజేసింది. ఎంతకీ ఆమెకు నిద్రరాలేదు.

సరాసరి కొడుకు గదిలోకి వెళ్లింది. తన ప్రశ్నకి జవాబు అక్కడ దొరుకుతుందని ఆమెకి తెలీదు. గదిలో బాబు లేడు.... విశాలమైన గది.... మధ్యలో అందమైన షాండ్లియర్. గది గోడలకి బ్లూకలర్ డిస్టెంపర్ వేసి వుంది. టేబుల్‌మీద చక్కని డిజైన్‌లో టేబుల్ లైట్... తెరచి ఉన్న డైరీ... చిన్నప్పుడే డైరీ రాయడం వాడికి బిందుయే అలవాటు చేసింది. రోజులో జరిగే, చేసే పనులన్నీ క్రమం తప్పకుండా, కల్మషం లేకుండా, దాపరికం లేకుండా రాసుకోవాలని నేర్పించింది. రాశాక ఒక్కసారి చదువుకుంటే తను రోజులో చేసిన తప్పొప్పులన్నీ ఒకసారి బేరీజు వేసుకొని సత్ప్రవర్తన అలవరచు కోవచ్చునని ప్రోత్సహించింది. ప్రియకి అలవాటు పట్టుబడలేదు గాని బాబు మాత్రం ఆమె చెప్పినట్లల్లా చేసేవాడు.

తెరిచే ఉన్నా బాబు డైరీ చదివేందుకు బిందు ఒక క్షణం సంశయించింది. ఒక్క క్షణమే – ఇతరుల డైరీలు చదవడం తప్పని తెలుసు. సంస్కారం కాదనీ తెలుసు. కానీ కొడుకు తనని ఇన్నేళ్ళలో ఒక్కసారైనా తలుచుకున్నాడో లేదో తెలుసుకోవాలని ఆరాటం కలిగింది ఆ మాతృహృదయానికి. పైగా తనువచ్చిన దగ్గర్నుంచీ ఎందుకంత కఠినంగా ఉంటున్నాడో? తన మీద కోపం ఎందుకుండాలి? తనేం తక్కువ చేసింది? ఏ తల్లీ ఏ బిడ్డలకి చేకూర్చలేనన్ని సౌకర్యాలు కలగచేసింది. బ్యాంకు బ్యాలన్స్ పెంచింది. వాళ్ళ చదువులు, భవిష్యత్తు నిరాటంకంగా వుండే ఏర్పాటుచేసింది. ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయించింది భర్తతో. ఇన్ని చేసినా తనమీద ఎందుకు కోపం?

వికారంగా తయారయిన తన మొహం చూడలేకనా? అందుకు జాలిపడాలి గాని... పోనీ భయపడుతున్నాడా? బాధపడుతున్నాడా?

అసంకల్పితంగా బిందు చేతులు డైరీ పేజీలు తిప్పాయి. అది చదువుతున్న కొద్దీ ఆమె పెదాలు కంపించాయి. నరాలు స్వాధీనం తప్పడం కాళ్ళు వణికిపోవడం మొదలెట్టాయి. అయినా టేబుల్ సొరుగు తెరిచి తనిక్కడలేని నాలుగైదేళ్ళ డైరీలు చకాచకా తిప్పింది.

''అమ్మ... అమ్మంటే ఎంతో ఇష్టం నాకు. అమ్మ ఫారిన్ వెళ్తానంటోంది. ఎంత గర్వంగా వుంటుంది నాకు. కాని బెంగగా వుంటుందేమో.

ఊహూ బెంగ పెట్టుకుంటానంటే అమ్మ వెళ్ళదు. అందుకే చెప్పకూడదు. బెంగలేదు... వెళ్లమనే చెప్పాలి. ఎంత రెండేళ్ళేగా!'' చదువుతున్న బిందుకి హృదయం ద్రవించింది. అది తను గల్ఫ్ వెళ్ళకముందు వాడు రాసుకున్న డైరీ పేజీలు తిప్పింది... ఆమె.

''ఫోన్‌లో అమ్మ గొంతు గమ్మత్తుగా ఉంది. ప్చ్ కానీ మధ్యలో కట్ అయిపోతుంది. లైన్స్ మీద ఎంత కోపం వస్తుందో అలాంటప్పుడు.

అమ్మరాసే ఉత్తరాల నిండా మా కబుర్లే. నేను కలలోకి వచ్చానని అమ్మ రాస్తుంటే ఎంత గర్వంగా వుందో నాకు. అమ్మబెంగ పెట్టుకోకుండా నేను రోజూ అమ్మకి కలలోకి వస్తే ఎంత బాగుండును''

ఇంకోపేజీ... ''డాడీ ఎంత ప్రేమగా చూస్తున్నా, ఎన్ని కొని పెడుతున్నా గుండెలో ఏదోలా వుంది. అమ్మ ఎంచక్కా పక్కలో పడుకుని ఎన్ని కథలు చెప్పేది. అన్నీ కంప్యూటర్ కథలే. నేనూ పెద్దయితే కంప్యూటర్ ఇంజనీర్ అయి కొత్తకొత్త కంప్యూటర్లు కనిపెడతాను. ముఖ్యంగా అమ్మ అనే కంప్యూటరు తయారుచేస్తాను. అప్పుడు నాలాంటి పిల్లలకి అమ్మ ఊరెళ్ళినా బెంగ ఉండదు''.

మరో డైరీ తీసింది. చకాచకా పేజీలు కదుల్తున్నాయి.

''అమ్మ వస్తోంది అంటే ఎంత ఉత్సాహంగా వుందో? మొన్న టింకు బర్త్‌డే పార్టీకి వాళ్ళ అమ్మ వాడికి ఎంత చక్కని ప్రజంటేషన్ ఇచ్చిందో?

బుగ్గమీద స్వీట్ కిస్. టింకూగాడు ఎంతో గర్వంగా ఫోజుకొడుతూ నాకేసి చూసి కన్నుగీటాడు. మమ్మీ వచ్చేస్తోంది కనుక నేనూ బోల్డు ఫోజులు కొట్టొచ్చు. తనివితీరా అమ్మచేత ముద్దులు పెట్టించుకోవచ్చు''.

ఒకచోట ఆగింది బిందు... ''కొత్త ఇల్లు ఎంత అందంగా విశాలంగా వున్నా అమ్మ లేక పోతే బోసిగానే వుంది. డాడీకి అదేచెప్తే గట్టిగా నవ్వేశారు. ఇదివరకున్న ఇల్లు చిన్నదైనా అమ్మ వుంది కనుక నిండుగా వుంది అనిపించింది. అమ్మకీ యిల్లు తప్పక నచ్చుతుంది''.

మరోపేజీ ... ''కారు చూసి నా ఫ్రెండ్స్ అంతా అసూయపడ్డారు. నేను డ్రైవింగ్ నేర్చుకుంటూంటే వాళ్ళ మొహాలు చూడాలి. కొందరు నా అదృష్టాన్ని మెచ్చుకుంటే కొందరు అమ్మని పొగిడారు. మరికొందరు డాడీని తప్పుగా మాట్లాడారు. డాడీకి చెప్తే అసూయతో పదిమంది అనే మాటలు పట్టించుకుని మనసు పాడు చేసుకోకూడదు అని చెప్పారు'' ఉలిక్కిపడింది బిందు.

మరో పేజీ... ''అమ్మ కలలో కనిపించి ఏడుస్తోంది. నా మీద బెంగగా వుందిట. చెల్లిని జాగ్రత్తగా చూడమంటోంది. మధ్యలో మెలకువ వచ్చేసింది. కల మరి కాసేపుంటే మరి కాసేపు అమ్మని చూసేవాడిని కదా! అమ్మ మీద బెంగవేస్తే అమ్మ తెచ్చిన వీడియో కెమెరాలో బంధించిన అమ్మని స్క్రీన్ మీద చూసుకుంటున్నాను. ఇలా ఎన్నాళ్లో!''

మరో డైరీలో – ''అమ్మ ఇంక వచ్చేస్తే బాగుండును. అక్కడుండడం నాకెందుకో ఇష్టం లేదు. సుబ్రహ్మణ్యం అంకుల్ డాడీ దగ్గర అమ్మ గురించి బ్యాడ్‌గా మాట్లాడితే డాడీ గట్టిగా కేకలువేసి గెటౌట్ అన్నారు. నాకూ అంకుల్‌ని చంపేయాలని వుంది. అమ్మ ఇంకా రాకపోవడానికి కారణం అది



## హోటల్ బిజినెస్‌లో త్రిష

దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకునే పనిలో పడింది త్రిష. టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్‌లలో బిజీగా ఉంటూనే, వ్యాపార రంగంలో కూడా అడుగుపెట్టనుంది. ఇంతవరకూ ఏ హీరోయిన్ చేయని వ్యాపారం చేయడానికి త్రిష రంగం సిద్ధం చేసుకుంది. గతంలోనూ, ప్రస్తుతం పలువురు హీరోయిన్లు రకరకాల వ్యాపార రంగాలలో స్థిరపడ్డారు. మొట్టమొదటి సారిగా హోటల్ రంగంలో అడుగుపెడుతున్న హీరోయిన్ త్రిష ఒక్కతే అని పలువురు అంటున్నారు. హోటల్ రంగంలో తన తండ్రికి ఉన్న అపార అనుభవాన్ని క్యాష్ చేసుకునే ఉద్దేశంలో ఆమె ఉంది. హైదరాబాద్‌లో స్టార్ హోటల్ ప్రారంభించే పనిలో పడింది. దీనికి సంబంధించి అన్ని పనులు చకచకా జరిగిపోతున్నాయన్నది తాజా సమాచారం. హోటల్ ప్రారంభోత్సవానికి సినీ ప్రముఖులతో పాటు, రాజకీయ ప్రముఖులను ఆహ్వానించనుందట! బాలీవుడ్‌లో అక్షయ్ కుమార్‌తో, టాలీవుడ్‌లో వెంకటేష్ సరసన నటిస్తున్న త్రిష బిజీబిజీగా ఉంటూనే హోటల్ పనులను స్వయంగా పర్యవేక్షిస్తోందట!

మాత్రం... అంటే... డాడీ ప్లేసులో ఇంకెవరో... ఛ... కాదు'' బిందు నరాల్లో రక్తం గడ్డ కట్టిపోయినట్టు కాసేపు స్తబ్ధురాలై కూర్చుంది.

''సాయి బాబాయి చెల్లి ప్రవర్తన బాగాలేదని కేకలేశాడు నెమ్మదిగానే. కానీ అది పెద్దగా ఏడుస్తూ బాబాయి మీద డాడీతో చాడీలు చెప్పింది... బాబాయికి డాడీకి పోట్లాట.... చెల్లి పాడయిపోవడానికి కారణం తప్పకుండా అమ్మ... అమ్మకీ డబ్బు పిచ్చి ఎందుకు? మేమేమయి పోయినా అమ్మకి ఫర్వాలేదన్నమాట... మావయ్యలు మమ్మల్ని ఒక్క సారయినా పలకరించరు. ఇది వరకయినా... మీ అమ్మ ఎంత బంగారం తెస్తోంది.. అన్నమాటే... అమ్మమ్మ... తాతయ్య 'డబ్బు కోసం పెళ్లాన్ని పరదేశం తోలేసాడు' అని డాడీని తిడుతోంటే నాకెంత కోపం వచ్చిందో...''

'డాడీని చెల్లి ఎదిరించింది. నేనే చెంప పగలగొట్టాను... నన్ను ఎన్ని తిట్టిందో?'

''డాడీకి తోడెవరున్నారు... అమ్మ ఎలాగూ రాదు... వంటల ఆంటీని పెళ్లి చేసుకుంటే... బాగుంటుందేమో'' బిందు ఉలిక్కిపడింది.

హిమబిందు చేతులు పేజీలు తిప్పుతున్నకొద్దీ బాబు అమాయక చిన్న హృదయంలో గూడు కట్టుకున్న మానసిక క్షోభ... ఆమె చెంపలమీదుగా కన్నీళ్లు....

''అమ్మ వస్తుందన్నా ఎయిర్‌పోర్టుకి వెళ్లాలనిపించలేదు... కానీ ఇంటికొచ్చిన అమ్మని చూసి ఎందుకో ఒక్షణం ఏడుపొచ్చింది. ఎంత కాలిపోయింది.... కానీ... మమ్మల్నందరినీ బాధపెట్టి ఇక్కడ ఒంటరిగా వదిలేసి... డబ్బు పిచ్చిలో పడ్డందుకు.... దేవుడు అమ్మకి బాగా పనిష్మెంట్ ఇచ్చాడు...'' హిమబిందు దుఃఖం హృదయ విదారకంగా ఉంది.

***

''మావయ్యా... నిజంగా ఇంట్లో సభ్యులకీ నాకూ మధ్య ఈ దూరం నేను భరించలేక పోతున్నాను. నాది ఎంత తప్పయినా ఇంత పెద్ద శిక్షా? నమ్మి నా బిడ్డల్ని ఆయన చేతిలో పెట్టానే... బాబికి నామీద ద్వేషం.... ప్రియ.... మత్తులో తేలడం... ఆయన ఇంటి మొహమే చూడక పోవడం...'' ఏడుస్తున్న బిందు శిరస్సును ఆమె మేనమామ గోపాల్రావుగారి చెయ్యి ఆప్యాయంగా స్పృశించింది.

''బిందూ.. రాజా నిన్ను ప్రేమించి పెళ్లి చేసుకున్నవాడు.... నీకన్నా అతనిమీద నాకెక్కువ విశ్వాసం... నీ పిల్లలది ఎదిగీ ఎదగని వయసు... తప్పొప్పులు తెలియని ప్రాయం.... తల్లిసాహచర్యం అవసరమైన వయసు... నువ్వు ఎప్పుడొస్తావో తెలియదు... అందుకే నీ కూతురు వేరే స్నేహాలు వెతుక్కుంది. పిల్లల విషయంలో తల్లిదండ్రులిద్దరిదీ సమానపాత్రే అయినా తల్లికున్న విశాల నేత్రం తండ్రి కుండదు... ఎంత ఉద్యోగస్తురాలయినా పిల్లలు సరయిన సమయానికి ఇల్లు చేరకపోతే తల్లి మాత్రమే పసిగట్టగలదు... నీ కొడుకు పరిస్థితీ అంతే... ఇంటికిరాగానే తల్లి కనిపిస్తే వాడికానందం... బయట ఎన్ని స్నేహాలున్నా తల్లితో అనుబంధానికి ఏదీ సాటిరాదు. వాడికా అవకాశం లేక నీమీద కోపం పెంచుకున్నాడు తప్ప అది ద్వేషం కాదు తల్లీ... ఇన్నాళ్ళూ డబ్బు మాయలో పడి నీ పిల్లలు పోగొట్టుకున్న ఇన్ని సంవత్సరాల బాల్యాన్ని.. అమ్మ సాన్నిహిత్యాన్ని వెనక్కి తెచ్చి ఇవ్వగలవా? అందుకే నీ కొడుక్కి పెంకితనం... అందుకే వాడికి తండ్రి మీద జాలి అంతేగాని...''

''మావయ్యా... మరి రాజా నేను మళ్లీ గల్ఫ్ వెళ్లాలని ఎందుకు కోరుకుంటున్నట్టు?'' ఆయన గలగలా నవ్వాడు.

''ఎంత చిన్నపిల్లలా మాట్లాడుతున్నావు బిందూ.... నీకు అక్కడేదో యాక్సిడెంటయింది కనుక డబ్బుకంటె ఆత్మీయుల సాన్నిహిత్యం కావాలనుకున్నావుగాని లేకపోతే మరో రెండేళ్ళ మరింత సంపాదిస్తూ అక్కడే ఉండి పోవాలనుకోలేదూ... గుండెల మీద చెయ్యేసుకుని చెప్పు...''

బిందు సిగ్గుతో తలొంచుకుంది...ఈ మావయ్య ఎంత తెలివైనవాడు... తన తప్పు తన నోటితోనే చెప్పిస్తున్నాడు...

''నన్ను క్షమించు మావయ్యా... నా భర్తనూ పిల్లలినీ దూరం చేస్తున్న ఆ సంపాదన నిజంగానే ఇంక నాకు అక్కర్లేదు...''

''కానీ ఆ విషయం రాజాకి నమ్మకం లేకనే ఈ నాటకం ఆడుతున్నాడనుకుంటాను... నువ్వీ సారి రాగానే.. నువ్వు మళ్లీ వెళ్లకూడదని దృఢంగా నిశ్చయించుకునే పరిస్థితులు నీ కళ్లబడాలనే... ఇదంతా... నిజం చెప్పు... నువ్వెప్పుడు సెలవులకి వచ్చినా కాంట్రాక్ట్ పొడిగించుకోమని అతనెప్పుడైనా బలవంత పెట్టాడా...''

''లేదు మావయ్యా''.

''మరెందుకమ్మా అతన్ని తప్పు పడతావు? అందరిచేతా నానా మాటలూ పడుతూ నీ పుట్టింటి వాళ్ల నుండి అవమానాలు భరిస్తూ – సంధి వయసులో ఉన్న పిల్లల్తో అతనెన్ని అవస్థలు పడుతున్నాడో తెలిస్తే నీ గుండె చెరువవుతుంది...''

''బాబాయ్‌గారూ... మరింక ఇంటికి వెళ్దామా?'' ఆయన మాటల్ని అడ్డుకుంటూ అక్కడికి వచ్చిన రాజారాం బిందుకి చెయ్యి అందిస్తుంటే ఆమె ఉలిక్కిపడింది.

''త్వరగా వెళ్తే శ్రీప్రియని డాక్టర్ దగ్గర్నుంచి పికప్ చేసుకోవచ్చు....'' సమాధానం ఆశించకుండా మళ్లీ అతనే అన్నాడు.

''డాక్టరా?''

''మత్తుమందుల కలవాటుపడిన పిల్లలకి ట్రీట్‌మెంటు... అంత త్వరగా అవదుగా'' మావయ్య మాటలకి బిందు కళ్లల్లో నీళ్లు... ''మావయ్యా...''


''నువ్వింకేం చెప్పకమ్మాయ్... కొండంత భర్త అండతో నీ పిల్లలిద్దరినీ ఆ మాత్రం దారికి తెచ్చుకోలేవా?''

''అంతేకాదు... మామధ్య ఏర్పడిన దూరాన్ని కూడా చెరిపేయగలను మావయ్యా...'' ..డ్రైవింగ్ చేస్తున్న రాజారాం భుజం మీద మావయ్య సమక్షంలోనే తల వాల్చు కోవడానికి బిందు సంకోచించలేదు.. సిగ్గుపడలేదు.

''ఇండియన్లు బానిసలు... డబ్బుకోసం మా దేశంలో ఎంత నీచమైన పని చెప్పినా చేస్తారు... ఛీ' అనిపించుకుంటూ దేశం కాని దేశంలో ఇన్నాళ్లూ డబ్బు కోసం మనసును కూడా అమ్ముకున్నాను.... నా దేశంలోని స్వేచ్ఛ ... నావాళ్ల ఆప్యాయతాను బంధాలు అక్కడ ఎన్ని లక్షలిస్తే దొరుకుతాయి...''

తను భర్తకీ పిల్లలకీ మధ్య... ఒక అందమైన పూలవంతెనలా అనిపిస్తూంటే... బిందు పెదవులపై ఈసారి నిశ్చింతతో కూడిన చిరునవ్వు మొలకెత్తింది. మనసులు తేలికయినట్టు నిట్టూర్చారు రాజారాం, గోపాల్రావుగారు.

*





చిరునామా:
పారుపూడి వెంకట సత్యనారాయణ
కేరాఫ్ విశాఖ యాడ్స్, 47.10.32
గుత్తికొండ మేన్షన్స్, సెకండ్ ఫ్లోర్
డైమండ్‌పార్క్ జంక్షన్, ద్వారకానగర్
విశాఖపట్నం– 530 010
సెల్: 94400 55311